
నేటి దినపత్రిక సూర్య www.suryaa.com 18వ వసంతంలోకి.. www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com

4 PM www.suryaa.com

గురువారం 07-08-2025 పేజీలు: 02


# స్టాక్ మార్కెట్లకు వరుస నష్టాలు

భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 సుంకాలను విధించిన నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు నష్టాలను కొనసాగిస్తున్నాయి. ట్రంప్ బెదిరింపుల కారణంగా అంతర్జాతీయంగా కూడా మిశ్రమ సంకేతాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ సూచీలు కూడా నష్టాలతో మొదలయ్యాయి. అయితే రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు విషయంలో గుడ్ న్యూస్ వచ్చే అవకాశం ఉందన్న వార్తలు వస్తుండడం కాస్త సానుకూలాంశంగా కనిపిస్తోంది. కాగా, ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల బాటలో ఉన్నాయి. బుధవారం ముగింపు (80, 543)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు 300 పాయింట్ల నష్టాలతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత కాస్త కోలుకుంది. పలు రంగాల్లో మదుపర్లు అమ్మకాలకు మొగ్గుచూపుతుండడంతో నష్టాల్లోనే కదలాడుతోంది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 279 పాయింట్ల నష్టంతో 80, 264 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే సాగుతోంది. ప్రస్తుతానికి 78 పాయింట్ల నష్టంతో 24, 495 వద్ద కొనసాగుతోంది.



# 31న చైనాకు మోడీ

ప్రధాని నరేంద్రమోదీ ఈ ఆగస్టు 31 నుంచి చైనాలో పర్యటించనున్నారు. ఆగస్టు 31,సెప్టెంబర్ 1 తేదీల్లో జరిగే షాంఘై సహకార సంస్థ శిఖరాగ్రసభలో ప్రధాని పాల్గొంటారు. 2019 తర్వాత ప్రధాని చైనాలో పర్యటించడం, ముఖ్యంగా 2020లో గల్వాన్ లోయలో ఘర్షణ తర్వాత ఆ దేశంలో పర్యటించడం ఇదే ప్రథమం. మోదీ చైనాలోని తియాంజిన్ ను సందర్శిస్తారు. రష్యానుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బ్రిక్స్ దేశాలను టార్గెట్ చేస్తున్న సమయంలో ప్రధాని మోదీ చైనా పర్యటన ప్రత్యేకత సంతరించుకుంది. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్రసభకు హాజరయ్యేముందు ప్రధాని మోదీ ఆగస్టు 30న జపాన్ ను సందర్శించనున్నారు. టోక్యోలో జపాన్ ప్రధాని ఫ్యూమియో కిషిడాతో కలిసి. భారత — జపాన్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. అక్కడి నుంచి ఆయన నేరుగా చైనా వెళ్తారని అధికార వర్గాలు తెలిపాయి.



## హజ్ యాత్రకు రూ.లక్ష.. దరఖాస్తుకు

# నేడే లాస్ట్ డేట్

2026 హజ్ యాత్రకు దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించింది. విజయవాడ ఎంబార్కేషన్ సెంటర్ ద్వారా వెళ్లే వారికి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. హజ్ యాత్ర 2026కు దరఖాస్తు చేసుకునేందుకు ఆగస్టు 7, గురువారం వరకు అవకాశం ఉందని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. హజ్ యాత్రకు వెళ్లాలనుకునే వారు వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కాగా విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుండి హజ్ యాత్ర-2025 చేసిన 72 మంది యాత్రికులకు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పన ప్రభుత్వం రూ.72 లక్షలు మంజూరు చేసింది.

# మయసభ రివ్యూ




పొలిటికల్ థ్రిల్లర్స్‌ను హ్యాండిల్ చేయడంలో దర్శకుడు దేవా కట్టా ఎక్స్‌పర్ట్. ఆయన తెరకెక్కించిన లేటెస్ట్ పొలిటికల్ డ్రామా 'మయసభ' సోనీ లివ్‌లో స్ట్రీమింగ్‌కు వచ్చింది. మరి ఈ సిరీస్ ఎలా ఉందో ఈ రివ్యూలో చూద్దాం.

ఆంధ్రప్రదేశ్‌లోని పులిచర్లకు చెందిన ఇద్దరు విద్యావంతులు కాకర్ల కృష్ణమ నాయుడు, ఎంఎస్ రామి రెడ్డిల జీవితకథే ఈ 'మయసభ' వెబ్ సిరీస్. కొన్నేళ్ల తర్వాత వారిద్దరు మళ్లీ కలుస్తారు. ఈసారి వారు రాజకీయాల్లోకి వచ్చేందుకు నిర్ణయం తీసుకుంటారు. వేర్వేరు కులాలు, నేపథ్యాలు, ఆలోచనలతో ఉన్నా ఈ ఇద్దరూ రాజకీయాల్లో కీలక నాయకులుగా ఎదుగుతారు. అయితే, కొన్ని కారణాల వల్ల వారిద్దరి దారులు వేరవుతాయి. ఆ తర్వాత ఏం జరిగింది..? రాయపాటి చక్రధర్ రావు ఎవరు.. ఆయన రాజకీయాల్లోకి ఎందుకు వస్తారు..? ఈ ఇద్దరు స్నేహితులతో RCRకు ఎలాంటి కనెక్షన్ ఉంది..? అనేది ఈ వెబ్ సిరీస్ కథ. రాజకీయాలకు సంబంధించిన కంటెంట్ ఎప్పటికీ ఆకట్టుకుంటుంది. ఇందులోని ట్విస్టులు, మలుపులు, ద్రోహం, లక్ష్యం, త్యాగం తదితర అంశాలు ప్రేక్షకులను మెప్పిస్తాయి. నచ్చినా నచ్చకపోయినా రాజకీయాలు ప్రజల జీవితాలతో ముడిపడి ఉంటాయి. దేవా కట్టా ఈ అంశాన్ని చక్కగా అవలంబిచుకుని, ఆసక్తికర పొలిటికల్ డ్రామాను తీర్చిదిద్దారు. ఆయన రైటింగ్, కథనంలోని లోతు ప్రేక్షకులను ఇంప్రెస్ చేస్తుంది. ఇక ఓ రాజకీయ కథలో ఏం చెప్పాడని కాదు.. దానిని ఆయన ఎలా చెప్పాడు అనేది మరింత ఆసక్తికరంగా ఉంటుంది. ఇలాంటి పొలిటికల్ కథలకు చక్కటి క్యాస్టింగ్ కూడా తోడుకావాలి. ఈ విషయంలో దర్శకులు మంచి మార్క్ చూపెట్టారు. రామి రెడ్డిగా చైతన్య రావు, కృష్ణమనాయుడు గా ఆది పినిశెట్టి పర్ఫెక్ట్‌గా సరిపోయారు. సాయి కుమార్, చక్రధర రావు కూడా తమ పాత్రలకు బాగా సెట్ అయ్యారు. ఆది, చైతన్య రావు తమ పాత్రల్లో జీవించారని చెప్పాలి. వారి స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను మెప్పిస్తుంది. ఇక కీలక సన్నివేశాలను సాయి కుమార్ హ్యాండిల్ చేసిన తీరు అద్భుతం. 'మేడమ్' అనే పాత్రలో దివ్య దత్తా అదరగొట్టింది. సిరీస్‌లోని పాత్రలకు మరింత డెప్త్ తీసుకురావడంలో ఆమె పాత్ర తోడ్పడింది. నాజర్ మీడియా లెజెండ్ శివాజీ రావు పాత్రలో, చేవెళ్ల బాబు రావు పాత్రలో శ్రీకాంత్ భరత్, పోతినేని రమేష్ అనే నక్సలైట్ పాత్రలో రవీంద్ర విజయ్, నటి అను హారిక పాత్రలో తాన్య రవిచంద్రన్ తమ పాత్రలతో ఆకట్టుకున్నారు. ఈ సిరీస్‌లోని కొన్ని సీన్స్ ప్రేక్షకులపై పవర్‌ఫుల్ ఇంపాక్ట్ చూపించాయి. ముఖ్యంగా RCR తన కొత్త రాజకీయ పార్టీని పెట్టడం వంటి సీన్స్ కట్టిపడేస్తాయి. ఆద్యంతం ఆకట్టుకునేలా సాగే ఈ సిరీస్‌లో లోపాలు కూడా ఉన్నాయి. సిరీస్ మధ్యలో ఈ వెబ్ సిరీస్ రైటింగ్ చాలా చప్పగా సాగుతుంది. ముఖ్యంగా భారత్‌లో ఎమర్జెన్సీ వంటి సన్నివేశాలు ఏమాత్రం ఆకట్టుకోవు. స్లో పేస్‌తో సాగే ఈ సీన్స్ ప్రేక్షకులను అలరించవు. దేవా కట్టా ఇదొక ఫిక్షన్ కథ అని చెప్పినా, ప్రేక్షకులు ఇందులోని పాత్రలు, సన్నివేశాలకు నిజజీవితంలోని వాటికి ఇట్టే కనెక్ట్ అవుతారు. ఇది కొంతవరకు వివాదాన్ని రేపే అవకాశం ఉంది. మయసభలో కొన్ని హింసాత్మక సన్నివేశాలు, కొన్ని బోల్డ్ డైలాగులు ఉన్నాయి. ఇవి ఫ్యామిలీ ఆడియెన్స్‌కు అంతగా కనెక్ట్ కావు. శత్రు, రవీంద్ర విజయ్ లాంటి యాక్టర్స్ పాత్రలకు పూర్తి న్యాయం చేయలేదు అనిపిస్తుంది. ఈ సబ్జెక్ట్‌ను దేవా కట్టా అండ్ టీమ్ చాలా జాగ్రత్తగా హ్యాండిల్ చేశారు. ఎవరికీ పక్షపాతం చూపకుండా అన్ని పాత్రలను బాగా డీల్ చేశారు. అయితే, మరికొంత బెటర్ రైటింగ్‌పై టీమ్ ఫోకస్ చేయాల్సింది. సురేష్ రగుటు, జ్ఞానశేఖర్ విఎస్ కెమెరా పనితనం అదిరిపోయింది. అలనాటి సన్నివేశాలను కళ్లకు కట్టినట్లు చూపెట్టారు. ఆర్ట్ డిజైన్ వర్క్ బాగుంది. ప్రవీణ్ కెఎల్ ఎడిటింగ్ వర్క్ చాలా వరకు బాగున్నా, కొన్ని సీన్స్‌ను ట్రిమ్ చేసి ఉండాల్సింది. శక్తికాంత్ కార్తిక్ నేపథ్య సంగీతం ఆకట్టుకుంటుంది. నిర్మాణ విలువలు బాగున్నాయి.

ఓవరాల్‌గా చూస్తే.. 'మయసభ' ఒక పొలిటికల్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో సక్సెస్ అయింది. చైతన్య రావు, ఆది పినిశెట్టి తమ పర్ఫార్మెన్స్‌తో ఇంప్రెస్ చేస్తారు. ఇందులో థ్రిల్లింగ్ అంశాలు, కథలో ట్విస్టులకు లోటు లేదు. అయితే, కొన్ని ఎపిసోడ్స్ చాలా సాగదీతగా సాగడం మైనస్. పేస్ కూడా చాలా చోట్ల ట్రాక్ తప్పింది. కొన్ని డైలాగులు, హింసాత్మక సన్నివేశాలు మెప్పించవు. పొలిటికల్ డ్రామాలను ఇష్టపడేవారు ఇలాంటి థ్రిల్లింగ్ సిరీస్‌ను తప్పకుండా చూడాలి.




# అమ్మాయిలను అమ్మోరులా పెంచాలి

30 రోజుల్లో ప్రేమించడం ఎలా' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న డైరెక్టర్ మున్నా ధులిపూడి నుంచి వస్తున్న మరో చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. 'కానీ చాలా మంచోళ్లు' అనేది ట్యాగ్ లైన్. అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న ఈ చిత్రంలో రోహన్ సూర్య, మొయిన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నీలి నీలి ఆకాశం క్రియేషన్స్, ప్రశ్విత ఎంటర్‌టైన్‌మెంట్, ఎన్‌వీఎల్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై శశిధర్ నల్లా, ఎమ్మాడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆస్కార్ విన్నర్ లిరిసిస్ట్ చంద్రబోస్ సాహిత్యం అందిస్తున్న ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్ మోషన్ పోస్టర్‌ను ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించిన గ్రాండ్ ప్రెస్‌మీట్‌లో దర్శకులు చందూ మొండేటి, శివ నిర్వాణ, కృష్ణ చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొని విడుదల చేశారు.



## ఇండియాకు వెళ్లిపో.. ఐర్లాండ్‌లో

# ఆరేళ్ల చిన్నారిపై దాడి

ఐర్లాండ్‌లో భారత సంతతికి చెందిన 6 ఏళ్ల బాలికపై జాత్యంహకార దాడి జరిగింది. వాటర్‌ఫోర్డ్ నగరంలో ఆగస్టు 4న, ఇంటి బయట ఆడుకుంటున్న 6 ఏళ్ల బాలికపై 12-14 ఏళ్ల వయసున్న కొందరు బాలురు దాడి చేశారు. ముఖంపై కొట్టడంతో పాటు వ్యక్తిగత అవయవాలపై దాడి చేసి గాయపరిచారు. డర్టీ ఇండియన్.. గో బ్యాక్ టూ ఇండియా అంటూ వాళ్లు అసభ్య పదజాలం ప్రయోగిస్తూ ఆ బాలికను వారించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది.

# వాసవీ నిర్మాణ సంస్థపై హైడ్రా చర్యలు



నాలాలు, వరద కాలువల కబ్జాలను హైడ్రా సీరియస్‌గా తీసుకుంది. భరత్‌నగర్ - ఖైతలాపూర్ మార్గంలోని కాముని చెరువు - మైసమ్మ చెరువులను కలుపుతూ సాగే వరద కాలువను కబ్జా చేసిన వాసవీ నిర్మాణ సంస్థపై హైడ్రా ఆగ్రహం వ్యక్తం చేసింది. 17 మీటర్ల వెడల్పుతో పాటు.. ఇరువైపులా 9 మీటర్ల చొప్పున బఫర్ విడిచి పెట్టకుండా.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేయడంతో హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీరంగనాథ్‌గారు బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ సమీపంలోని ముల్లకత్వ చెరువు - కాముని చెరువు - మైసమ్మ చెరువులను కలుపుతూ వెళ్లే వరద కాలువలో మట్టి పోసినట్టు నిర్ధారణ అయ్యింది. నిర్మాణ సంస్థపై కేసు పెట్టాలని హైడ్రా కమిషనర్ అధికారులను ఆదేశించారు. నాలా ఆక్రమణలను వెంటనే తొలగించాలని సూచించారు. ఈ మేరకు హైడ్రా అధికారులు జేసీబీలతో, టిప్పర్లతో మట్టిని తొలగించారు. ఆ మట్టిని వాసవీ నిర్మాణ సంస్థకు చెందిన స్థలంలోనే పడేశారు. వరద కాలువను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారంటూ వాసవీ నిర్మాణ సంస్థపై కూకట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. కొంతమేర ఇరువైపులా రిటైనింగ్ వాల్స్‌తో నిర్మించిన కాలువ మధ్యలో స్లాబ్ వేసేందుకు ఉద్దేశించిన పిల్లర్లను కూడా తొలగించాల్సి ఉందని హైడ్రా అధికారులు గుర్తించారు.




# డిగ్రీ ఎగ్గొట్టి మోడలింగ్

ప్రస్తుతం ఈ క్రేజీ హీరోయిన్ పేరు టాలీవుడ్ లో బాగా వినిపిస్తోంది. అలాగనీ ఈ ముద్దుగుమ్మ పెద్దగా సినిమాల్లో నటించలేదు. ఇప్పటివరకు కేవలం రెండంటే రెండు సినిమాల్లో హీరోయిన్ గా యాక్ట్ చేసింది. అందులో ఒకటి యావరేజ్ కాగా మరొకటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ మూవీ. దీంతో ఈ అమ్మడికి సినిమా అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా మరో తెలుగు సినిమాలో ఈ అందాల తారకు అవకాశం దక్కించి. క సినిమాతో బ్లాక్ బస్టర్ కొట్టిన కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం కే ర్యాంప్ లో ఈ ముద్దుగుమ్మకు కథానాయికగా అవకాశం లభించింది. దీంతో ఈ బ్యూటీ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రస్తుతం టాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్లలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకుంటోన్న ఆమె మరెవరో కాదు యుక్తి తరేజా. నాగ శౌర్య నటించిన రంగబలి మూవీతో తెలుగు సినిమాకు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ మార్కో సినిమాతో పాన్ ఇండియా ఫేమస్ అయ్యింది.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# స్పీకర్ సంచలన కామెంట్స్



కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి అడుగడుగునా అడ్డుకుని, లేనిపోని ఆటంకాలు సృష్టిస్తోందని శాసనసభ స్పీకర్ అప్పావు ఆరోపించారు. తిరునల్వేలిలో గురువారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశ విదేశీ వ్యవహారాల విధానం బలహీనమై పోయిందని, పహల్గామ్ దాడులకు సంబంధించి పాకిస్తాన్‌ను ప్రపంచ దేశాలేవీ ఖండించలేదని గుర్తు చేశారు.రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించినట్లు అన్నాడీఎంకే నేతలు ఆరోపిస్తున్నారని, తిరుప్పూరు వద్ద అన్నాడీఎంకే ఎమ్మెల్యేకి చెందిన తోటలో ఎస్సై దారుణహత్యకు గురయ్యారని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నదెవరో ఈ సంఘటన రుజువు చేస్తుందన్నారు. కలైంజర్ పేరుతో విశ్వవిద్యాలయం ఏర్పాటు బిల్లును గవర్నర్ అంగీకరించకపోవడం విచారకరమని, కొత్త విశ్వవిద్యాలయాలను ప్రారంభించే హక్కు రాష్ట్రానికి ఉందని, ఈ విషయం తెలిసినా గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతి ఆమోదానికి పంపడం గర్హనీయమన్నారు. డీఎంకే ప్రభుత్వం దక్షిణాది జిల్లాల అభివృద్ధిపై దృష్టిసారించడం లేదని ఆరోపించిన వారంతా విన్‌పాస్ట్ కార్ల కర్మాగారం ప్రారంభం, పెట్టుబడిదారుల సదస్సులో పలు కంపెనీలతో ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం చూసి విస్తుపోతున్నారన్నారు. గత నాలుగేళ్లలో రాష్ట్రం 11.19 శాతం ఆర్థికాభివృద్ధి సాధించినట్లు కేంద్ర ప్రభుత్వమే ప్రకటించిందని, ఈ విషయం కేంద్ర మంత్రి ఎల్.మురుగన్‌కు తెలియకపోవడం వింతగా ఉందన్నారు. విదేశీ పెట్టుబడుల సమీకరణ ద్వారా రాష్ట్రానికి అందిన నిధులను వివరాలను చెప్పాలని మురుగన్ డిమాండ్ చేయడం కూడా విడ్డూరంగా ఉందని, విదేశాల నుండి వచ్చే నిధులు కేంద్ర ప్రభుత్వ పరిశీలించిన మీదటే రాష్ట్రానికి అందుతాయన్న విషయం కూడా ఆయనకు తెలియదా అని స్పీకర్ అప్పావు ప్రశ్నించారు.



## కేసీఆర్ పై పలు ఆరోపణలు చేసిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తాజాగా పార్టీ అధినేత కేసీఆర్‌పై పలు ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తనను చంపుతామని వచ్చిన బెదిరింపులను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు.తెలంగాణ ఉద్యమం నుంచి తాను నిర్విరామంగా పార్టీ బలోపేతం కోసం పని చేశానని తెలిపారు. 2009 ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా బలవంతంగా నిలబెట్టారని, 2014, 18 ఎన్నికల్లోనూ ఎంపీ బీ ఫామ్ ఇవ్వాలని చూశారని చెప్పారు. మొదటి నుంచి పార్టీలో ఉన్న తనకు ప్రాధాన్యత ఇవ్వకుండా, కాంగ్రెస్ పార్టీ నుంచి చేరిన రాజయ్య, కడియం శ్రీహరికి మంత్రి పదవులు ఇచ్చారని తెలిపారు.అచ్చంపేటలో తనపై దాడులు జరిగినా ప్రశ్నించలేదన్నారు. భూకబ్జాలు జరుగుతున్నా ప్రశ్నించడంలో విఫలమయ్యారని విమర్శించారు. మొయినాబాద్ ఫాంహౌస్ ఘటనలో పట్టించుకోలేదన్నారు. ఉమామహేశ్వర ప్రాజెక్టు గురించి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లినా పురోగతి లేదని బాలరాజు ఆరోపించారు. ఈ పరిస్థితుల కారణంగానే తాను పార్టీకి రాజీనామా చేయాల్సి వచ్చిందని బాలరాజు వివరించారు.

## భారత కీలక ఉత్పత్తులపై
# ఏకంగా 50 శాతం సుంకం విధింపు

భారత్‌తో వాణిజ్య సంబంధాల విషయంలో అమెరికా సంచలన నిర్ణయం తీసుకుంది. రష్యా నుంచి నిరంతరాయంగా చమురు కొనుగోలు చేస్తున్నందుకు ప్రతిగా, భారత్ నుంచి దిగుమతి అయ్యే కీలక ఉత్పత్తులపై ఏకంగా 50 శాతం మేర భారీ సుంకాలను విధిస్తున్నట్టు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయంతో లెదర్, వజ్రాలు-ఆభరణాలు, టెక్స్‌టైల్స్, రసాయనాలు వంటి భారత కీలక ఎగుమతి రంగాలు తీవ్ర సంక్షోభంలో పడ్డాయి. అమెరికా ప్రకటించిన ఈ కొత్త సుంకాలు దశలవారీగా అమల్లోకి రానున్నాయి. ఇప్పటికే ఉన్న సుంకానికి అదనంగా, ఈ రోజు నుంచి 25 శాతం, ఆ తర్వాత ఆగస్టు 27 నుంచి మరో 25 శాతం సుంకాన్ని పెంచనున్నారు. ఈ భారీ పెంపుతో అమెరికాకు వెళ్లే భారత ఎగుమతులు 40 నుంచి 50 శాతం వరకు పడిపోయే ప్రమాదం ఉందని పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీనివల్ల అమెరికా మార్కెట్లో భారత వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి, వాటికి గిరాకీ తగ్గే అవకాశం ఉంది.ఈ సుంకాల ప్రభావం అత్యధికంగా టెక్స్‌టైల్స్, వజ్రాలు-ఆభరణాలు, లెదర్, పాదరక్షలు, రొయ్యలు, రసాయనాలు, యంత్ర పరికరాల రంగాలపై పడనుంది. ముఖ్యంగా, భారత ఎగుమతుల్లో కీలక పాత్ర పోషిస్తున్న వజ్రాలు, ఆభరణాల పరిశ్రమపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుందని జెమ్ అండ్




జ్యూయలరీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ వంటి వాణిజ్య సంఘాలు హెచ్చరించాయి. గతంలో అమెరికా 10 శాతం సుంకం విధించినప్పుడే దాదాపు 50,000 మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారని, ఇప్పుడు 50 శాతం పెంపుతో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశాయి.రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనా, టర్కీ వంటి ఇతర దేశాలను వదిలేసి, కేవలం భారత్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ శిక్షాత్మక సుంకాలను విధించడం గమనార్హం. జాతీయ భద్రత, విదేశాంగ విధాన కారణాలను చూపుతూ అమెరికా ఈ నిర్ణయాన్ని సమర్థించుకుంది. ఈ సుంకాల నుంచి మినహాయింపు కోరుతూ భారత, అమెరికా వాణిజ్య సంఘాలు చేసిన ప్రయత్నాలు ఇప్పటి వరకు ఫలించలేదు. ఈ పరిణామంతో న్యూఢిల్లీ, వాషింగ్టన్ మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.



## నేషనల్ క్రష్ లుక్స్

వరుస సినిమాలతో క్షణం తీరిక లేకుండా గడిపే పాన్ ఇండియా స్టార్ రష్మిక మందన్న, షూటింగ్ లేనప్పుడు ఏం చేస్తారు? అభిమానులందరిలో మెదిలే ఈ ఆసక్తికర ప్రశ్నకు ఆమె స్వయంగా సమాధానమిచ్చారు. విరామ సమయాన్ని కేవలం విశ్రాంతికి మాత్రమే కాకుండా, వ్యాపార పనులకు, కుటుంబంతో గడిపేందుకు ఎలా బ్యాలెన్స్ చేసుకుంటారో ఆమె వివరించారు. తన ఆఫ్-స్క్రీన్ జీవితం వెనుక ఉన్న ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. షూటింగ్ లేని రోజుల్లో తన పెంపుడు కుక్కతో సమయం గడపడమంటే ఎంతో ఇష్టమని రష్మిక తెలిపారు. "సాధారణంగా నా పెంపుడు కుక్కతో ఆడుకుంటాను. వాకింగ్‌కు వెళ్తాను. ఖాళీ సమయం దొరికితే మిస్ అయిన షోలు చూస్తాను లేదా పుస్తకాలు చదువుతాను" అని ఆమె అన్నారు. బిజీ లైఫ్‌లో కూడా ఇలాంటి చిన్న చిన్న సంతోషాలను ఆస్వాదించడం ఎంతో ముఖ్యమని ఆమె అభిప్రాయపడ్డారు. కేవలం విశ్రాంతికే పరిమితం కాకుండా, తన వ్యాపార వ్యవహారాలను కూడా తానే దగ్గరుండి చూసుకుంటానని రష్మిక స్పష్టం చేశారు. "కొన్నిసార్లు బ్రాండ్ కాల్స్ మాట్లాడాల్సి వస్తుంది. అలాగే నా 'డియర్ డైరీ' ప్రాజెక్ట్ పనుల్లో నిమగ్నమవుతాను.



## ఉప రాష్ట్రపతి ఎన్నికకు
# నోటిఫికేషన్ రిలీజ్

ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం నోటిఫికేషన్ విడుదల అయ్యింది. సెప్టెంబర్ 9న జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికలకు భారత ఎన్నికల కమిషన్ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో నామినేషన్ ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. నోటిఫికేషన్ ప్రకారం.. ఆగస్టు 21 నామినేషన్లు దాఖలు చేయడానికి చివరి తేదీ కాగా.. ఆగస్టు 22న నామినేషన్ పత్రాలను పరిశీలిస్తారు. నామినేషన్ ఉపసంహరణకు ఆగస్టు 25 చివరి తేదీగా నిర్ణయించారు. ఇటీవల జగదీప్ ధన్కర్ ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిదే. తన ఆరోగ్య పరిస్థితుల నేపథ్యంలో రాజీనామా చేస్తున్నట్లు ఆయన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. ఆయన పదవీకాలం ఆగస్టు 2027లో ముగియనుంది. ఇంకో రెండేళ్లు పదవికాలం ఉండగానే ధన్కర్ రాజీనామా చేయడంపై ప్రతిపక్షాలు అనుమానం వ్యక్తం చేశాయి. కావాలనే ఆయన చేత కేంద్ర సర్కార్ రాజీనామా చేయించిందని విమర్శలు చేశాయి.

## రషీద్ ఖాతాలో అరుదైన రికార్డు




అఫ్ఘానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ టీ20 చరిత్రలో సరికొత్త రికార్డు లిఖించాడు. ఇంగ్లండ్‌లో జరుగుతున్న 'ది హండ్రెడ్' టోర్నీలో లండన్ స్పిరిట్ తరఫున ఆడుతున్న రషీద్.. ఓవల్ ఇన్‌విసిబుల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మూడు వికెట్లు పడగొట్టి పొట్టి ఫార్మాట్‌లో 650 వికెట్లు తీసిన మొదటి బౌలర్‌గా రికార్డులకెక్కాడు. ఈ మ్యాచ్‌లో 20 బంతులేసిన రషీద్.. 11 పరుగులే ఇచ్చి 3 వికెట్లు తీశాడు. టీ 20 (అంతర్జాతీయ, లీగ్‌లు కలిపి)లలో రషీద్ 478 ఇన్నింగ్స్‌లలో 651 వికెట్లు తీయగా విండీస్ దిగ్గజం డ్వేన్ బ్రావో 631 వికెట్లతో రెండో స్థానంలో ఉన్నాడు.

## ఉద్యోగులకు టీసీఎస్ తీపి కబురు..
## 80 శాతం ఉద్యోగుల వేతనాలు పెంపు

పెద్ద ఎత్తున ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించి షాకిచ్చిన భారత్‌లోని అతి పెద్ద ఐటీ సర్వీసుల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఇప్పుడు తీపి కబురు చెప్పింది. దాదాపు 80 శాతం ఉద్యోగుల వేతనాలను పెంచుతున్నట్లు తెలిపింది. టీసీఎస్ తాజా నిర్ణయంతో జూనియర్, మధ్య స్థాయి (సీ3ఏ గ్రేడ్ వరకు) ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. సెప్టెంబర్ 1 నుంచి వేతన పెంపులను అమలు చేయనున్నట్టు ఉద్యోగులకు పంపిన ఈ మెయిల్‌లో టీసీఎస్ సీహెచ్ఆర్‌వో మిలింద్ లక్కడ్ తెలిపారు. కాగా, ఇటీవలే టీసీఎస్ పెద్ద ఎత్తున లేఆఫ్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. తన మొత్తం ఉద్యోగుల్లో 2 శాతం మందికి ఉద్వాసన పలకనున్నట్లు తెలిపింది. వచ్చే ఏడాది కల్లా దాదాపు 12,200 మంది ఉద్యోగులపై దీని ప్రభావం పడనున్నది. మధ్య స్థాయి, సీనియర్ స్థాయి ఉద్యోగులపై అధికంగా వేటు పడే అవకాశం ఉంది. ఈ విషయాన్ని టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కే కృతివేశన్ మనీకంట్రోల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. లేఆఫ్స్ ప్రకటన వేళ కంపెనీ జీతాల పెంపు నిర్ణయం ఉద్యోగులకు ఊరటనిచ్చే అంశమనే చెప్పాలి.

## టాప్‌లోనే బుమ్రా, రూట్




అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసిసి) బుధవారం ప్రకటించిన తాజా టెస్టు ర్యాంకింగ్స్‌లో టీమిండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో విభాగంలో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఇంగ్లండ్ సిరీస్‌లో అసాధారణ రీతిలో రాణించిన హైదరాబాదీ స్టయిలిష్ బౌలర్ మహ్మద్ సిరాజ్ తాజా ర్యాంకింగ్స్‌లో 15వ స్థానానికి చేరుకున్నాడు. ఇక బ్యాటింగ్ విభాగంలో ఇంగ్లండ్ సీనియర్ ఆటగాడు జో రూట్ టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. భారత యువ సంచలనం యశస్వి జైస్వాల్ మూడు స్థానాలు మెరుగుపరుచుకుని ఐదో ర్యాంక్‌లో నిలిచాడు. టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఒక స్థానాన్ని కోల్పోయి 8వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. భారత్‌తో జరిగిన సిరీస్‌లో అద్భుత బ్యాటింగ్‌తో అలరించిన రూట్ టాప్ ర్యాంక్‌కు ఢోకా లేకుండా పోయింది. భారత బౌలర్ల ను దీటుగా ఎదుర్కొన్న రూట్ సచిన్, అండర్సన్ సిరీస్‌లో పరుగుల వరద పారించాడు. దీంతో తాజా ర్యాంకింగ్స్‌లోనూ రూట్ అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. రూట్ 908 పాయింట్లతో టాప్ ర్యాంక్‌ను కాపాడుకున్నాడు. ఇక ఇంగ్లండ్‌కే చెందిన హ్యారీ బ్రూక్ ఒక ర్యాంక్‌ను మెరుగుపరుచుకుని రెండో స్థానంలో నిలిచాడు. చివరి టెస్టులో బ్రూక్ సెంచరీతో రాణించిన సంగతి తెలిసిందే. కేన్ విలియమ్సన్ (న్యూజిలాండ్) ఒక ర్యాంక్‌ను కోల్పోయి మూడో స్థానానికి పడిపోయాడు. ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ తన నాలుగో ర్యాంక్‌ను నిలబెట్టుకోవడంలో సఫలమయ్యాడు. భారత ఓపెనర్ యశస్వి మూడు ర్యాంక్‌లు ఎగబాకి ఐదో స్థానానికి చేరుకున్నాడు.